చివరకు తేలింది

హనుమాన్లు కార్నర్‌లో మలుపు తిరగ్గానే హఠాత్తుగా కనిపించిన గోపాలాన్ని చూచి అన్నాడు ముఖం వేళ్లాడేసుకుని:

"నేనిక బ్రతుకనోయ్" అని.

గోపాలం బిత్తరపోయాడు. ఉలిక్కిపడ్డాడుకూడా. కంగారుగా సైకిల్ దిగాడు.

"ఏం? ఇదేంఅఘాయిత్యం? మీ నాన్నతో గాని మళ్లా పోట్లాడావా ఏం ఖర్మ?"

హనుమాన్లు క్షణం సేపటివరకు మౌనంగా వుండి, ముఖంమీద, గంభీరమైన విషాదరేఖ సృష్టించి, ఒక పెద్ద నిట్టూర్పువిడిచి మళ్లీ ఆ ముక్కే అన్నాడు కొంచం హెచ్చు స్థాయిలో......

"నే నిక బ్రతుకనోయ్...!!"

గోపాలం గాబరాపడ్డాడు. 'విషయమేమిటో చెప్పడేం? తిక్కరకం!' అని మనస్సులో విసుక్కున్నాడు.

అప్పటి హనుమాన్లు పరిస్థితి చూస్తే చాలా జాలివేసింది గోపాలానికి. ముఖం అంతా నల్లబడి పెంకులా వుంది. తలమీదవి నాలుగు వెంట్రుకలైనా, శెత్తికి రాసిన నూనె కాస్తా హరించుకుపోయి పీచులా రేగివున్నాయి. ఇంచుమించు ఎప్పుడు చూచినా, మడత నలగని యిస్త్రీబట్టలతో కనిపించే హనుమాన్లు ఆనాడు నల్లగా మాసినబట్టలు వేసుకున్నాడు...

గోపాలం, హనుమాన్లుకి కాస్త ధైర్యం చెప్పినమీదట చిఱునవ్వుతో అన్నాడు.

"మళ్ళీ ఏమయినా యుద్ధం ప్రకటించావా మీ యింట్లో...?"

"లేద"ని అడ్డంగా తలవూపాడు హనుమాన్లు.

ఇంట్లో, అడపా దడపా దెబ్బలాడి, ఆ రాత్రల్లా ఏ హోటల్లోనో గది అద్దెకు తీసుకుని మకాంవేసి, తెల్లవారి ప్రొద్దున్నకల్లా మళ్లా యథావిధిగా యింటికి హాజరవటం పరిపాటే హనుమాన్లుకి. అయితే

సత్యశ్రీ

ఈ రోజు, అటువంటిదేమీ కాకుండా, ఇటువంటిమాట అన్నాడంటే ఏదో గొప్ప విశేషమే వుందనుకున్నాడు గోపాలం.

"మరో రెండు, మూడు నెలల్లో పెళ్లికొడుకువి కాబోతున్నావు—యింతలో నే ఏమొచ్చి పడ్డదిరా నాన్నా...?" అన్నాడు గోపాలం, దిగులు దిగులుగా నేలచూపులు చూస్తూ, గోడుమీద కాలితో రాస్తూన్న హనుమాన్లు భుజం తడుతూ.

మరో మాంచి 'మూడ్'లో వుండివుంటే ఆ మాటకు హనుమాన్లు పక్కుమని నవ్వేవాడే...అయితే యిప్పుడు కనీసం మందహాసంకూడా రాలేదు ఆ మనోజ్ఞమైన వదనం మీదకు...! అయితే ఒక్క క్షణంమాత్రం మౌనంగా ఉండి అకస్మాత్తుగా ఏదో గుర్తుకొచ్చినట్టు తకీమని అందుకున్నాడు హనుమాన్లు.

"ఇదిగో సముద్ర పొడ్డుకు పద-చెప్తా."

గోపాలం వాడి కళ్ళల్లోకి చూచి నవ్వాడు.

"దేనికి? చావటానికా? నేను కూడా దేనికి? నాకు చావాలని లేదు!" అన్నాడు వ్యంగ్యధోరణిలో నవ్వుతూ.

హనుమాన్లు వదనంలో దరహాసరేఖలు ఒక్కసారిగా మెరిశాయి.

"ఛా, ఉత్తినే అన్నా, అక్కడ ఏకాంతంగా కూర్చొని అంతా చెబుతాను-పదు!"

'సరే' అన్నాడు గోపాలం. ఇద్దరూ కలసి, ముందుగా గోపాలంయింటికి వెళ్లి, సైకిల్ మీద తెచ్చిన కూరగాయలసంచి యింట్లో యిచ్చివేసి, మధ్యదారిలో హోటల్లో బిల్లు చెల్లించుకుని సముద్రపొడ్డుకు బయలుదేరారు.

సముద్రపుటొడ్డు రకరకాల వ్యక్తులతో రంగు రంగులుగా విలసిల్లుతోంది. సముద్రగర్భంలోకి, సాయంకాలపు సూర్యుడు చొచ్చుకునిపోతూ, ఉవ్వెత్తుగా లేచే సముద్రతరంగాలమీద బంగారుపూత పూస్తున్నాడు. సముద్రం హోరు పెడుతూ చల్లటిగాలిని వెదజల్లుతోంది.

ఈవ్యక్తు లెవరితోటీ సంబంధం లేకుండా ఆ యిద్దరు మిత్రులు చివరకంటా పోయి, ఒడ్డునే వున్న కొబ్బరిచెట్ల నీడల్లో కూర్చున్నారు. సమీపంలోనే, యిసుకపర్రలో నుంచి సముద్రగర్భంలోకి చొచ్చుకుపోయిన నల్లరాళ్ళ గుట్టకి, తరంగాలు బలంగా, ఢీకొన్నప్పుడల్లా నీటితుంపరలు పైకి ఎగిరి ముత్యాలు రాలినట్లు రాలుతూన్నాయి.

గోపాలం కొబ్బరిచెట్టుకు జేరబడి కూర్చున్నాడు. హనుమాన్లు, ఎదురుగా మౌనంగా కూర్చుని వున్నాడు.

"సరి-యిక చెప్పు నీ పురాణం ఏమిటో;" అన్నాడు గోపాలం.

హనుమాన్లు మౌనంగానే లేచి నిలబడి, పాంటు జేబులోనుంచి ఏదో కాగితాలుతీసి గోపాలం ముందు పడేస్తూ అన్నాడు:

"చూడు గోపాలం!" నువ్వు నాప్రాణమిత్రుడివే అయినా, యిన్నాళ్లుగా నాకు ఈ విషయం చెప్పకుండా దాచినందుకు క్షమించు-అలా అని నే నెందు కనుకున్నా

జీవించి ఉన్నంతకాలము తమరే కాశ్మీరాధీశ్వరులు! మేమంతా మీ భృత్యులమే!"

అని చెప్పి ప్రవరసేనుడు నెమ్మదిగా అక్కడినించి వెళ్ళిపోయాడు.

చక్రవర్తి ప్రవరసేనునిలో హఠాత్తుగా కలిగిన అద్భుత పరిణామాని కెంతో ఆశ్చర్యపడ్డాడు.

అటుపిమ్మట నాలుగైదు రోజులకు మాతృగుప్తుడు సన్న్యసించాడనీ వెంటనే వారాణసీ నగరానికి వెళ్లిపోయాడనీ ప్రవరసేనుని కొకవార్త తెలిసింది. అనంతరం మాతృగుప్తుని అజ్ఞాప్రకారంగా కాశ్మీర మహామాత్యుడు ప్రవరసేనుని రాజ్యాధికారం స్వీకరించవలసినదని ప్రార్థించాడు. ఆ పరిస్థితులలో ప్రవరసేనునికి రాజ్యాధికారం స్వీకరించక తప్పలేదు.

మాతృగుప్తుడటుపిమ్మట పది సంవత్సరాలు జీవించాడు. అంతవరకు ప్రవరసేనుడు మాతృగుప్తుని ప్రతినిధిగానే కాశ్మీర రాజ్యం పరిపాలించాడు. కాశ్మీర రాజ్యాదాయం అంతా మాతృగుప్తునికే పంపించేవాడు. మాతృగుప్తుడా ఆదాయంఅంతా తిరిగి కాశ్మీరానికే పంపించి దానిలో స్వల్పాదాయం మాత్రమే స్వీకరించి అది విద్వాంసులకు, కవీశ్వరులకు, యతీశ్వరులకు, యాచకులకు, దీనులకు దానం చేసేవాడట!

పామరులు విశ్వసింపలేరనే భయంతో విశ్వసనీయమైన యథార్థ విషయాలే వ్రాస్తున్నానని కల్హణుడు రాజతరంగిణి పీఠికలో పేర్కొన్నాడు! ఆ కల్హణుడే విక్రమాదిత్య మాతృగుప్త ప్రవరసేనుల చరిత్రలు మూడు మూడు పునీతమార్గాల్లో ప్రవహించిన ఆకాశ గంగానదీ ప్రవాహాలవంటివని ముక్తకంఠంతో ప్రశంసించాడు! ★

★ చివరకు తేలింది ★

నంటే, పర్యవసానం ఏమిటో తెలుసుకునేవరకూ చెప్పగూడదనుకున్నాను. ఇప్పుడు దాని పర్యవసానమే తేలింది! ఐతే ఐతే...!" యిక మాట్లాడలేక, మనస్సులో వున్న ఉక్రోషమో, ఉద్రేకమో బయటకు ఒక్కుమ్మడిగా తన్నుకురావడం వల్ల ఆగిపోయాడు హనుమాన్లు...!

గోపాలం, వాడి ఉపన్యాస ధోరణి ముగ్ధుడై విన్నమీదట, వాడిచ్చిన కాగితాల కట్ట విప్పటం మొదలు పెట్టాడు.

వాటిని ఒక్కటొక్కటిగా తీసిచూస్తూ తెల్లబోయాడు గోపాలం. అందులో అన్నీ ముత్యాల్లాటి దస్తూరితో హనుమాన్లు రాసిన ప్రేమలేఖలు! అయితే వాటిని పూర్తిగా చదివే భాగ్యం కలుగలేదు గోపాలానికి. ఉత్తరాలనిండా, నల్లసిరా జిమ్మిన మరకలు వాటిమీద చిక్కిరిబిక్కిరిగా కొట్టివేసిన పిచ్చిగీతలు దట్టంగా అల్లుకొని ఉన్నాయి! వాటిలోనే ఒక చక్కటి బొమ్మ ఎంతో జాగ్రత్తగా చిత్రించిన అమోఘమైన చిత్రం కోతిబొమ్మ ఉంది! దానిక్రింద 'వాయుసుతుడు' అని చక్కని అక్షరాలు, ముద్దులొలికే అక్షరాలు చిత్రింపబడి ఉన్నాయి.

గోపాలానికి ఇవన్నీ చూచేసరికి మతి పోయినట్లయింది. కొన్ని క్షణాల వరకు మాట్లాడలేకపోయాడు. కొంతసేపటికి తేరుకుని హనుమాన్లుకేసి వింతగా చూచిఅన్నాడు:

"ఏమిటి! ఇదెప్పటినుంచి! అయితే వాటినిండా సిరామరకలు, కొట్టివేతలు, ఆబొమ్మ, దీని అర్థం ఏమిటంటావ్?"

హనుమాన్లు మాట్లాడలేదు. హృదయకుహరంలో వున్న ఉద్రేకం కళ్లల్లోంచి బయటకు వెళ్లగ్రక్కుతున్నాడు. గోపాలం మళ్ళీ అందుకున్నాడు అతనినుంచి సమాధానం రాకముందే.

"దమయంతి! మీ ఇంటిప్రక్కయింట్లో ఉంటూన్న వకీలుగారి అమ్మాయి థర్డ్ బి.ఏ. నా మట్టుకు నాకు చాలా పెంకిపని అనిపిస్తూంది!"

పెల్లుబికివస్తూన్న నవ్వును బలవంతంమీద ఆపుచేసుకుంటూ అన్నాడు గోపాలం: ఇదేమీ కనిపెట్టలేదు హనుమాన్లు.

"అదే, అదే." హనుమాన్లు గంభీరోపన్యాసం మొదలుపెట్టాడు: "ఆమె నాప్రేమ నిరాకరించిందని నేను విచారించడం లేదిప్పుడు. నిజంగా దమయంతిని నేను మనసారా ప్రేమించానసే అనుకో-నా ఉద్దేశ్యం ఆమెకు తెలియాలంటే ఉత్తరాలు రాయక తప్పదు. అందుకని రాశాను-చాలా చాలా రాశాను. బహుశః ఆమెకు నన్ను పెళ్ళిచేసుకోడం ఇష్టంలేకపోతే మొదటి ఉత్తరానికే ఆ ఉద్దేశ్యం చెప్పేస్తే ఎంత బావుండేది? నన్నిలా అవమానించడం దేనికి? మొదటే ఆమె ఉద్దేశ్యం తెలిస్తే మళ్ళీ ఆమె వైపు కన్నెత్తిగూడా చూచివుండేవాణ్ని కాను. ఆ ఉత్తరాల్లో అసభ్యతగాని, అవినీతిగాని స్ఫురించే వాక్యం ఒక్కటీ రాయలేదు నేను. అటువంటప్పుడు-యిలా అవమానించాల్సిన అవసరం? పైగా ఆ బొమ్మ! దాని అర్థం ఏమిటి? నిజంగా నేను తలచుకుంటే ఏ పనైనా చెయ్యటానికి వెనుకాడను!"

ఇంకా, ఏదో ఏదో మనస్సులో రగిలే ఉక్రోషాన్నంతా వెళ్ళగ్రక్కేశాడు హనుమాన్లు.

గోపాలం యిదంతా విన్నమీదట వాణ్ని పూరడించాడు పైకి. అయితే, దమయంతి మరే ప్రమాదమైన రసాభాసం చెయ్యకుండా యింతటితో సరిపెట్టినందుకు లోలోన సంతోషించాడు గోపాలం. ఈ వుద్దేశ్యమే హనుమాన్లు దగ్గర పెడితే వాడు ఒప్పుకోడని తెలుసు గోపాలానికి. నిజంకూడా అంతే--

హనుమాన్లు, గోపాలం చేతిలోనుంచి ఆ ఉత్తరాలు, ఆ బొమ్మ అవి తీసుకున్నాడు ఎందుకో.

"అయితే వీటిని ఏమి చేద్దామనుకుంటూన్నావు?" అన్నాడు గోపాలం హనుమాన్లువైపు వింతగా, జాలిగా చూస్తూ.

హనుమాన్లు గంభీరంగా నవ్వాడు.

"అదే-చెప్తానడు. ఆ నల్లరాళ్ల గుట్ట వుంది చూడు సముద్రంలో, వాటిమీదకు పద-" అన్నాడు కాగితాన్ని చుట్టగా చుడుతూ. గోపాలం ముందు విస్తుపోయి, తరువాత నవ్వాడు- "కొంపతీసి వీడుకూడా వాటితోపాటు సముద్రంలో దూకడు కదా?" అనుకున్నాడు. హనుమాన్లు తరహా ఎక్కువగా తెలిసివున్నవాడు కాబట్టి ఆ భయం ఏమీలేదనుకున్నాడు మళ్లీ.

ఇద్దరూ ఆ రాళ్లగుట్ట ఎక్కారు. హనుమాన్లు కొన్ని క్షణాలు ఆ ఉత్తరాల చుట్టకేసి తీక్షణంగా చూచి, విసురుగా సముద్రంలోకి విసరిపారవేసి తిరిగి, అప్రయత్నంగా 'కవ్వు'మన్నాడు.

ఆ రాళ్లగుట్ట ప్రక్కనుంచే, యిసుకలో నడిచివెళుతూ, సిల్కురుమాలతో నోరు మూసుకుని, వాళ్లను దాటగానే ఒక్కసారిగా కిలకిలా నవ్వేశారు యిద్దరు యువతులు...!

ఉడికిపోయాడు వాయుసుతుడు.

మండిపోతున్నాడు పవన నందనుడు.

పళ్లు పటపటలాడించాడు అనిల పుత్రుడు.

ఆ యిద్దరు యువతులు పోనుపోను దూరమైపోయారు. ఒకామె, రెండుజడలు వేసుకుంది—ఒకటి ముంగుకు, రెండోది వెనక్కు. చేతిలో, అందమైన తెల్ల సీమ కుక్కపిల్లను గొలుసుతో పట్టుకుంది. పాల నురుగులాంటి సిల్కు కోక- గులాబిరంగు జాకెట్.

"దమయంతి!" అన్నాడు గోపాలం.

హనుమాన్లు దారుణమైన కోపంలో వున్నాడేమో, ఏమీ మాట్లాడకుండా వాళ్లు పోయే దిక్కువైపుకే చూస్తూ నిలబడిపోయాడు-

గోపాలం, అతని రెక్క పట్టుకుని మెల్లగా రాళ్లమీదనుంచి యిసుకలోకి తీసుకొచ్చాడు.

"చాలా పెంకిఘటం? నువ్వు వాటిని సముద్రంలోకి విసరడం చూసిందేమో! ఆ ప్రక్కనున్న ఆమె ఎవరంటావ్? క్లాస్ మేట్ కదూ?

ఇక హనుమాన్లు మాట్లాడకుండా వుండలేకపోయాడు-

"అవును- వాళ్లందరితో ఈ విషయం చెప్పి నా పరువు ప్రతిష్ఠలు తియ్యాలని చూస్తోందనుకుంటా. చూచి చూచి యింత పని చేస్తుందనుకోలేదు దమయంతి. అయితే నా తడాకా యింకా తెలియదుకాబోలు కానియ్" అంటూ తల పంకించాడు హనుమాన్లు.

వీళ్లిద్దరూ రోడ్డు ఎక్కేసరికి నడినెత్తిన చంద్రుడు ప్రకాశిస్తూన్నాడు. మొదట కలుసుకున్న 'కార్నర్'లోనే యిద్దరూ విడిపోయారు. హనుమాన్లు హృదయం ఉడికిపోతోంది. గోపాలం హనుమాన్లుమీద సానుభూతి ప్రకటించాడు

* * * *

తెల్లవారింది. ఉదయం 9-30 దాటింది.

కాలేజీ ఆవరణలో ఏదో కలకలం బయలుదేరింది. విద్యార్థులు - వికవికలు, గుసగుసలు మొదలుపెట్టారు. ప్రిన్సిపాల్ ఆఫీసు గది వరండాలో, చేతులు వెనక్కు పెట్టుకుని, రుసరుసలాడుతూ అటుయిటూ తిరుగుతూన్నాడు-నేరస్థు డెవరాఅని ఆలోచిస్తూ.

ఇంత రసాభాసానికి కారణం ప్రహరీ గోడలనిండా మసిబొగ్గుతో దమయంతిమీద అసభ్యమైన రాతలు రాశారు ఎవరో! ఆ సమస్యే తేలడంలేదు.

రెండుబకెట్ల నీళ్లతో ఆ రాతలన్నీ కనిపించకుండా చెరిపించేసి, ఆలోచనలో పడ్డాడు ప్రిన్సిపాల్—

క్లాసులు జరుగుతున్నాయి. సందడంతా తగ్గిపోయింది.

హనుమాన్లు క్లాసులో కూర్చున్నాడేగాని

రెక్స్పర్ ఏమి చెప్పబోతున్నాడో అర్థం గావటంలేదు. అవునుమరి-ఎలా అర్థమవుతుందీ....? ప్రక్క భయం వేధిస్తోంటే-

హనుమాన్లు ఆ ఉక్కురోషంలో తొందరపడి, యిక ఆ వేళం పట్టలేక, ఒకరాత్రి వచ్చేసి ఈ పని చేశాడే గాని, యిప్పుడు దాని పర్యవసానం తలచుకుంటోంటే వణుకొత్తిపోతోంది.

దమయంతి తప్పకుండా, తనమీదే, తన అనుమానాన్ని వ్యక్తం చెయ్యకుండా మానదు-ప్రిన్సిపాల్ తో...అప్పుడు జరిగేదేమిటి? బహుశః ప్రిన్సిపాల్ పెద్ద చర్యనే తీసుకుంటాడు. ఈ విషయంలో అవును-తప్పదు. ఛీ! తను తొందరపడిపోయాడు ఈ విషయంలో. తనకు హానిరాని విధంగా పగతీర్చుకోవలసింది దమయంతి మీద. అయితే యిప్పుడు ఏంలాభం జరిగిపోయిన తరువాత-తన యింట్లో ఈ విషయం తెలిస్తే? కొంపలంటుకోవూ-తన్ను మళ్ళీ గడప త్రొక్కనివ్వడు తన తండ్రి.

ఇంకా ఏదో ఏదో ఆలోచించాడు హనుమాన్లు. ప్రక్కబెంచీల్లో కూర్చున్న గోపాలంకేసి చాలాసార్లు చూచాడు అతి జాలిగా. ఆచూపులో తను తొందరపడ్డట్టు వ్యక్తమవుతున్నది. గోపాలం మొదటే ఊహించాడు గోడమీద రాసిన రాతలు చూచి. అయితే నిజంగా యింత సాహసం, తొందరపాటు చేస్తాడనుకోలేదు హనుమాను.

క్లాసు మరో అయిదునిమిషాలకు అయిపోతుం దనగా, ప్రిన్సిపాల్ దగ్గరనుంచి ఏదో నోటీసు వచ్చింది. నోటీసు అనగానే హనుమాన్లు గతుక్కుమన్నాడు. గుండెలు వేగంగా కొట్టుకుంటూన్నై. బహుశః తనను హాజరు కమ్మని అయివుంటుంది అనుకున్నాడు.

అయితే నోటీసు చదవగానే క్లాసులో అందరికన్నా ఎక్కువ, హనుమాన్లు ఆశ్చర్యపోయాడు, గోపాలం ఉలిక్కిపడ్డాడు.

ఆ నోటీసులో ఈ క్లాసుముగియగానే, గోపాలం తక్షణం ప్రిన్సిపాల్ ముందు హాజరు కావాలి అని వుంది.

గోపాలానికి అర్థం కాలేదు తన్ను ఎందుకు హాజరు కమ్మన్నది కూడా. హనుమాన్లుకి అంతకన్నా అర్థంకాలేదు. అయితే తక్కిన క్లాసు విద్యార్థులకు మాత్రం ప్రొద్దుటి కేసు విషయంలో గోపాలం ప్రసక్తి వుండి వుంటుంది అని అనుకున్నారు కొందరు.

గోపాలం, ప్రిన్సిపాల్ ఎదుట హాజరయ్యే ముందు హనుమాన్లు, ఎంతో జాలిగా ప్రాధేయపడ్డాడు. ఒకవేళ తన విషయంలో యింకా ఎక్కువ బలమైన సాక్ష్యాలు గోపాలంద్వారా, ఆ కాలేయ్యాల్సిన ఉద్దేశ్యం వుంటే, ఏమాత్రం తొణకొద్దని బ్రతిమిలాడుకున్నాడు గోపాలాన్ని. గోపాలానికి ఒక ప్రక్క హనుమాన్లు మీద జాలి, మరో ప్రక్క అయోమయమైన పరిస్థితి ఏర్పడింది.

గోపాలం ప్రిన్సిపాల్ గదిలోకి ప్రవేశించగానే, చురచుర చూచాడు ప్రిన్సిపాల్ అతనివంక-ప్రక్కనే మరో బెంచీ మీద దమయంతి కూర్చుని వుంది తలవంచుకుని. గోపాలం రాగానే తలవంచుకునే కొంటెకళ్ళతో గమ్మత్తుగా చూసింది గోపాలంవైపు.

గోపాలం వినయంగా ప్రిన్సిపాల్ కి నమస్కరించి నిలబడ్డాడు-

ప్రిన్సిపాల్ గంభీరంగా మొదలు పెట్టాడు.

"చూడు గోపాలం యింతవు మునుపు నిన్ను చాలా మంచివాడు, అమాయకుడు అనుకున్నాను. కాని యింత ఘటికుడవు అనుకోలేదు. ప్రొద్దుటివిషయంలో, ఆ రాతలు రాసింది, నువ్వే అయివుంటావని దమయంతి స్వయంగా రిపోర్టు చేసింది. దీనికి సంజాయిషీ ఏమి చెప్పుకుంటావ్?" అన్నాడు.

ఇది వినగానే గోపాలం అదిరి పడ్డాడు. కొన్ని క్షణాలవరకూ మాట రాలేదు. ఇది చాలా అగమ్యగోచరంగా కనిపించింది గోపాలానికి.

తను అనుకున్నదివేరు-యిప్పుడు జరిగేది వేరయింది. దమయంతి యిలా తనమీద ఎందుకు నిందవేసి వుంటుంది? బహుశః నిజం తెలియకా? అది నమ్మదగినది కాదు—హనుమాన్లే రాశాడని ముమ్మాటికీ తెలుసు దమయంతికి. మరయితే యిలా ఎందుకు చేసింది? లేకపోతే, నిజంగా తనే రాశా ననుకుంటుందేమో?

అమాయకంగా దమయంతి కళ్ళల్లోకి చూచాడు గోపాలం. దమయంతి గమ్మత్తుగా నవ్వింది...! ఆ నవ్వులో అర్థం ఏమిటో తెలియలేదు గోపాలానికి.

ప్రిన్సిపాల్ గోడవైపు తిరిగివున్నవాడల్లా యిటు తిరిగి కోపంగా అంటున్నాడు:

"ఊఁ...! చెప్పు—స్వయంగా ఆడపిల్ల వచ్చి, రిపోర్టు చేసిందంటే యిక దానికి ఆలోచించాల్సిన పనిలేదు. నువ్వు 'కాద'ని వాదించినా నేను నమ్మేదిలేదు. తొందరగా ఒప్పుకో. కొద్దిలోనే పోతుంది. లేదంటా నా పెద్ద చర్య తీసుకోవాల్సి వస్తుంది."

గోపాలం ఆలోచనలో పడ్డాడు. నిజం తేలేవరకూ ప్రిన్సిపాల్ వూరుకోడు-అసలు దమయంతికి నిజం తెలిసి కూడా తన్ను యిలా ఏడిపిస్తూందా? అలా అనుకుంటానికి ఆమెకు తనేమి అపకారం చెయ్యలేదే.! పోని నిజం తనే చెప్పేస్తే? అసలు విషయం అంతా ఏకరువుపెట్టి! లాభంలేదు. ముప్పు వచ్చేదల్లా హనుమాన్లుకి. వాడిప్పటికే ఏడుస్తూన్నాడు. ఈ విషయం, వాడింట్లో తెలిస్తే అసలు గుమ్మం త్రొక్కనివ్వడు వాడి నాన్న. బహుశః ఫైను వేస్తే యిచ్చుకోలేడు కూడా. మరేమిటి దారి? ప్రిన్సిపాల్ మళ్ళీ రెట్టించాడు. గోపాలం తెగించాడు.

"అవును-పొరపాటైంది. క్షమించండి!" అన్నాడు తలవంచుకునే.

దమయంతి ఉలిక్కిపడింది. గోపాలం కేసి వెఱ్ఱిగా, అర్ధనిమీలిత నేత్రాలతో చూసింది. గోపాలం సగర్వంగా మందహాసం చేశాడు. తల వంచింది దమయంతి.

ఇటువంటి దేమీ ప్రిన్సిపాల్ గమనించ

శ్రీమదాంధ్ర
మహాభారతము
ఉద్యోగపర్వము
వెల రూ. 1-0-0
ఆంధ్రగ్రంథమాల,
మదరాసు-1

ప్రెసిడెంట్
వెజిటబుల్ హేర్ ఆయిల్,
స్నో, టాల్కమ్ పౌడర్
నా ఉపయోగానికి శ్రేష్ఠమైనవని నేను కనుగొన్నాను.
—అంజలీదేవి.

ఉత్పత్తిదారులు:
రథోడ్ ట్రేడింగ్ కంపెనీ, మద్రాసు - 1.

★ చివరకు తేలింది ★

లేదు; గమనించేలా వాళ్లిద్దరూ ప్రవర్తించ లేదు కూడా.

గోపాలం తొందరగా తప్పు ఒప్పుకున్నందుకు శాంతించాడు ప్రిన్సిపాల్.

"సరే! యిక నువ్వు వెళ్ళిపోవచ్చును. వేరే సంజాయిషీ ఏమీ చెప్పుకోనవసరం లేదు. మధ్యాహ్నం వచ్చి నోటీసుబోర్డు చూచుకో." అన్నాడు ప్రిన్సిపాల్.

గోపాలం బయటకొచ్చాడు. వస్తూవస్తూ దమయంతికేసి మరోసారి చూచాడు. దమయంతి తెల్లగా ప్రకాశించే చక్రాల్లాటి కళ్ళతో ప్రశాంతంగా చూసింది. అంతే.

హనుమాన్లు గోపాలం వచ్చేవరకూ గేట్లోనే కాసుకుకూర్చున్నాడు. గోపాలం వచ్చి హనుమాన్లు భుజం తట్టి నవ్వాడు.

"ఎందుకు పిలిపించాడు ప్రిన్సిపాల్? నన్ను గురించిగాని ఏమయినా చెప్పిందా దమయంతి?"

గోపాలం మందహాసంచేసి, విషయం అంతా ఏకరువు పెట్టేసరికి హనుమాన్లు నిర్ఘాంతపోయాడు.

"ఇదేవిటి కథ యిలా అడ్డం తిరిగిందే? అయినా నువ్వెందుకు ఒప్పుకున్నావ్?" అన్నాడు హనుమాన్లు గోపాలం కళ్ళల్లోకి పిచ్చిగా చూస్తూ. గోపాలం మళ్ళీ నవ్వాడు.

"నీకోసం!" అన్నాడు గోపాలం.

హనుమాన్లు మౌనం వహించాడు. మౌనంగానే ఏదో ఆలోచిస్తూ నడిచాడు గోపాలంతో పాటుగా.

మధ్యాహ్నం వచ్చి నోటీసుబోర్డు చూచుకున్నారు. అందులో గోపాలం ఆశించిన మాదిరిగానే వుంది. ఏమంత పెద్ద శిక్ష కాదు. పదిహేను రూపాయల ఫైనుతోబాటు నాలుగు రోజులు సస్పెన్షన్. నిజంగా పొరపాటు గోపాలమే చేసి వుంటాడని కాలేజీ మొత్తంమీద ఎక్కువ మంది నమ్మలేకపోయారు. అయితే గోపాలం స్వయంగా ఒప్పుకున్నాడు గాబట్టి ఎవరు మాట్లాడలేకపోయారు.

* * *

హనుమాన్లుకి యిది పెద్ద సమస్యగా ఏర్పడిపోయింది. "దమయంతి ఎందుకిలా చేసింది? అదే... దే అర్థంగావడంలేదు హనుమాన్లుకి. ముఖ్యంగా గోపాలం తనమీద చూపిన ఔదార్యానికి మనస్సులో ఎంతో మెచ్చుకున్నాడు గోపాలాన్ని. తను చేసిన పొరపాటును వాడు తనంతట తానుగా తనమీద రుద్దుకుని, తనకు ఏమీ నిందరాకుండా చేశాడు. నిజంగా ఎంత సాహసం? అయితే వాడు చూపిన ఔదార్యానికి తను చూపవలసిన ప్రత్యుపకారం ఏమిటి? తను ప్రిన్సిపాల్ దగ్గరకు వెళ్ళి నిజం ఒప్పుకుంటే? ఏమో! తనకంత సాహసం వుందా? ఏదో తొందరపడి చేశాడేగాని, పర్యవసానం ఆలోచించాడుకాడు. గోపాలం తన విషయంలో చూపిన ఔదార్యానికి మనస్సులోనే వాడికి కృతజ్ఞత తెలుపుకోగలడు. అంతకంటే మరేమీ చెయ్యడానికి తనకు ధైర్యంలేదు. తనింత పరికిపందగా తయారయ్యాడేం? ఛీ!

హనుమాన్లు, ఆలోచనలలో పడిపోతోంటే మళ్ళీ ముందు సమస్యే తట్టింది. "అయితే, దమయంతికి నిజం తెలియదా? అసంభవం-మరయితే వాడిమీద ఎందుకు రిపోర్టు చేసింది!" అదే... అదే... పాలుపోలేదు హనుమాన్లుకి.

ఇంటిదగ్గర, దమయంతిని చాలాసార్లు ఈ విషయం అడిగెయ్యాలనుకునేవాడు ధైర్యంచేసి. చాలాసార్లు దమయంతి, వాళ్ళదొడ్లో సన్నజాజిపూలు తుంపుతోంటే, చూచి, గబగబా వెళ్ళిపోయి, నాలుగూ దులిపివేద్దామనుకునేవాడు హనుమాన్లు. అయితే ఆమెను చూడగానే నోరు పెగిలేదుకాదు హనుమాన్లుకి. దమయంతిమాత్రం రెండుమూడుసార్లు ఈ ప్రవర్తన కనిపెట్టి, క్రింది పెదవి నొక్కిపట్టి గమ్మత్తుగా నవ్వేది అదే.! దాని అర్థమే అవగాహనం కాలేదు హనుమాన్లుకి...!

* * *

ఈ సంఘటన జరిగిన పదిరోజుల అనంతరం, హనుమాన్లు ఒకనాటిరాత్రి, తొమ్మిదిన్నర గంటలకు, ఒక్కడే బయట అరుగుమీద పడకకుర్చీలో కూర్చుని గోపాలం కోసం నిరీక్షిస్తూన్నాడు. గోపాలం రెండో ఆట సినిమాకు వెళదామన్నాడు.

అరుగుమీద హరికేన్ లాంతరు వూచనుంచి వేళ్ళాడుతూ, కునుకుతూంది. హనుమాన్లుకూడా పడకకుర్చీలో కునికిపాట్లు పడుతూన్నాడు.

అకస్మాత్తుగా, వున్నట్టుండి ఎక్కడనుండో చిన్న బెడ్డముక్క హనుమాన్లు మీద పడగానే అదిరిపడి లేచి చూచాడు.

ప్రక్కయింటి వకీలుగారి అరుగుమీద

(56-వ పేజీ చూడండి)

ఆంధ్రపత్రిక

ఉగాది సంచిక

ఆర్థిక, రాజకీయ, సాహిత్యవిషయాలపై
ప్రముఖుల ప్రత్యేక వ్యాసాలతో

ఉత్తమాంధ్ర రచయితల
కథానికలు, నాటికలు, సాహిత్య విమర్శలతో

ప్రముఖ ఆంధ్ర చిత్రకారుల
త్రివర్ణచిత్రాలు, రేఖాచిత్రాలతో

తెలుగు ఉగాదినాటికే పాఠకులకు అందుతుంది.

వెల రు. 2-0-0, పోస్టుఖర్చులతో రు. 2-14-0

ఆంధ్రపత్రిక న్యూస్ ఏజెంట్లందరి దగ్గర లభ్యమవుతుంది.

నేడే మీ ప్రతిని రిజర్వు చేసుకోండి.

ఆంధ్రపత్రిక, మేనేజరు, మద్రాసు-1.

★ చివరకు తేలింది ★

(12 వ పేజీ తరువాయి)

నుంచి, గాజుల గలగల వినిపించేసరికి అటు వైపు చూచి నివ్వెరపోయాడు హనుమాన్లు.

అరుగుమీద, దమయంతి నిలిబడివుంది నవ్వుతూ–

హనుమాన్లుకి మతిపోయింది. దమయంతి మళ్ళీ చిరునవ్వు నవ్వి, ఏదో కాగితం చూపి, దొడ్డివైపు రమ్మని సంజ్ఞచేసి యింట్లోకి వెళ్లిపోయింది.

హనుమాన్లు కళ్లు చీకట్లు క్రమ్మాయి–ఇదేమిటి...తను కలగనటం లేదుకదా కొంప తీసి, అనుకుని లేచి, తడబడుతూ దొడ్లోకి వెళ్ళాడు.

అక్కడ వాళ్ల దొడ్లో దమయంతి సన్నజాజి పందిరి ప్రక్కగా నిలబడివుంది. ఏదో కాగితం పట్టుకుని.

హనుమాన్లు యివతలి పిట్టగోడవరకూ వెళ్ళి నిలబడ్డాడు–

హనుమాన్లు గోడదగ్గరకు రాగానే, దమయంతి చేతిలోని కాగితాన్ని యివతలకు విసరివేసి, లేడిపిల్లలా యింట్లోకి వెళ్లిపోయింది.

హనుమాన్లు పులకరించాడు ఒక్కసారిగా. కొన్ని క్షణాలు కదలలేకపోయాడు. పూపొద చాటునుంచి తనంతట తాను వచ్చి పడ్డలేఖ...! ప్రే...మ...లే...ఖ...!

హనుమాన్లు ఎలాగో తేరుకుని, ఆ లేఖను వణుకుతూ తీసి, తొందరగా వచ్చేసి, అరుగుమీద కునికే హరికెన్ లాంతరు వత్తిని పెద్దదిగా చేసి, విప్పాడు ఆ కాగితాన్ని.

శ్రీయుత హనుమాన్లు గార్కి...

మీరు చేసిన సాహసాన్ని, నేను అభినందిస్తూన్నాను...! మొదట మీరు నాకు రాసిన, ఉత్తరాల్లోని విషయమంతా కవిత్వమని, వాస్తవానికి దూరమని నాకు తెలుసు. కాదంటారా? మొన్న మీరు ఉక్రోషంతో చేసిన పనికి, మీ మిత్రుడు నెత్తి మీద వేసుకోవాల్సివచ్చింది. ఆ నాడు నిజం తెలియక నేను ప్రవర్తించలేదు. మీ యిద్దరిలో, ఒకరికి ఒకరు చేసే త్యాగం ఎలా వుంటుందోనని అలా చేశాను. ఇంగులో మీరు ఓడిపోయారు—మీ మిత్రుడు గెలిచాడు. మీ కోసం, మీకు అపనింద రాకుండా చేసేనిమిత్తం, తను నిర్దోషి అయినా "తప్పు" ఒప్పుకున్నాడు. అయితే అప్పుడు మీరు చెయ్యాల్సిన పని ఏమిటంటారు? మీ మిత్రుడు దోషికాదని నిరూపించాలి. గండం తప్పిందే చాలనుకుని, ప్రశాంతంగా వూరుకున్నారే గాని, ప్రిన్సిపాల్ ఎదుటికి వచ్చి తప్పును ఒప్పుకోలేకపోయారు. ఇంత త్యాగపురుషులైన మీరు నా కోసం ఎన్నో ఎన్నో త్యాగాలు చేస్తానని ఉత్తరాల్లో కవిత్వాలు వ్రాశారేగాని, మీ మిత్రుడి విషయంలో, మీరు వెనకాడినప్పుడు, మీరు వ్రాసిన ఉత్తరాల్లో వాస్తవం శూన్యమంటే మీరు బహుశః ఒప్పుకోకపోవచ్చును. నిజంగా ఆనాడు మీ తప్పు ఒప్పుకుంటే నేను మిమ్మల్ని తప్పకుండా వివాహం చేసుకునేదాన్నేమో. అయితే అలా జరుగలేదు—యిది ఎవరి అదృష్టమంటారు?

సరి–యిక ఆ విషయం వదలి వెయ్యండి–దానితో పాటుగా నా విషయం కూడా వదలి వెయ్యండి...!

అన్నట్టు ఒక శుభవార్త!

మీ మిత్రుడు, మీ కోసం సాహసం చేసిన గోపాలాన్ని నేను వివాహం చేసుకోబోతున్నాను—దీనికి మా నాన్న కూడా ఒప్పుకున్నారు. గోపాలం ఒప్పుకోవడమే తరువాయి—ఒప్పుకుంటాడనే నమ్మకం నాకుంది.

ఇకనుంచి నన్ను మీసోదరిగా చూస్తారని ఆశిస్తూన్నాను—మీ ఉత్తరాలు త్రిప్పి పంపేటప్పుడు చేసిన చిలిపిపనికి నన్ను క్షమిస్తారని ఆశిస్తూన్నాను.

సెలవు—దమయంతి."

ఆ లేఖ ముగిసేసరికి హనుమాన్లుకి కళ్లు చీకట్లు క్రమ్మాయి. హరికెన్‌లాంతరు టపటప కొట్టుకొని, ఒక్కసారిగా ఆరిపోయింది.

హనుమాన్లు నిలబడలేక, చేతిలో ఆ లేఖ పట్టుకుని క్రిందకు వాలిపోతుంటే, అప్పుడే అరుగు ఎక్కుతోన్న గోపాలం హడలిపోయి, గాబరాగా వచ్చి పట్టుకున్నాడు హనుమాన్లుని. ★

అమ్మకానికి సిద్ధముగానున్నది
శ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి సిద్ధాంతిగారిచే గుణింపబడిన
ఆంధ్రపత్రిక
శ్రీ దుర్ముఖనామ సంవత్సర
పంచాంగం
ఈ సంవత్సరం పంచాంగంలో చాంద్రమాన, దృక్సిద్ధాంతాల ప్రకారం రెండు పద్ధతుల తిథి, నక్షత్రాదులు, గోచారఫలములు, దశాభుక్తులు ఇత్యాది అనేక ముఖ్యమైన విషయములు వేర్వేరుగా చూపబడినవి.
54 పుటలు క్వార్టర్ డెమ్మీ సైజు. వెల ప్రతి 1-కి 0-3-0
" " " 100-కి 16-8-0
" " " 1000-కి 150-0-0
1000 కాపీలు ఒకే దఫా కొనువారి చిరునామా ముఖపత్రమున ముద్రించబడును.
రైలు ఖర్చులు మినహా.
మేనేజరు, ఆంధ్రపత్రిక, మద్రాసు-1.

హకల్ బెరిఫిన్
వెల రూ. 2-0-0
పోస్టుఖర్చులు అదనము.
ఆంధ్రగ్రంథమాల, మదరాసు-1

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.